గడువులోగా లక్ష్యం పూర్తయ్యేనా.!

- ఐదు రోజులే గడువు
- లక్ష్యం రూ.33.73 కోట్లు..
- ఇప్పటివరకు వసూలైంది రూ. 25 కోట్లు
- వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌పై విస్తృత ప్రచారం

ఆస్తిపన్ను చెల్లించని దుకాణాలను సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

జూబ్లీహిల్స్,మార్చి 26 : ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపులకు మార్చి 31తో గడువు ముగియనుండడంతో జీహెచ్ఎంసీ అధికారులు ఆస్తిపన్ను వసూలును వేగిరం చేస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఈ ఏడాది రూ.33.73 కోట్ల ఆస్తిపన్ను వసూలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.25 కోట్లు వసూలైంది. ఆస్తిపన్ను వసూలుకు మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉండడంతో రూ.8 కోట్లపైగానే ఉన్న బకాయిల వసూలుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఆస్తిపన్ను వసూలుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌ను అందిస్తున్న అధికారులు పాత బకాయిలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. ఏరియర్స్‌పై 90 శాతం వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలు ఆస్తిపన్ను వసూలు చేపడుతున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఆయా బృందాలతో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ కమల్, ఇన్‌చార్జ్ ఏఎంసీ బాల్‌రాజ్ ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు.

సకాలంలో చెల్లించకుంటే చర్యలు

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆస్తిపన్ను చెల్లింపులకు మార్చి 31 వరకు గడువు ఉండడంతో ఈ ఏడాది పన్నుతో పాటు పాత బకాయిలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. మొండి బకాయిదారుల ఆస్తులను సీజ్ చేస్తున్నారు. రెండు రోజులుగా ఆస్తిపన్ను చెల్లించని దుకాణాలను జీహెచ్ఎంసీ సిబ్బంది సీజ్ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆస్తిపన్నుపై ఇస్తున్న వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకుని పాత బకాయిలు వెంటనే చెల్లించాలి. ఈ ఏడాది చెల్లించాల్సిన ఆస్తిపన్నుకు మార్చి 31 వరకు వున్న గడువులోపు చెల్లించకుంటే వడ్డీభారం పడుతుంది. ఆస్తిపన్ను చెల్లించకుండా మొండికేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. చట్ట ప్రకారం ఆయా ఇంటి యజమానుల ఆస్తులు, దుకాణాలను లేదా ఆస్తులను సీజ్ చేస్తాం.

– సేవా ఇస్లావత్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్

బీటీ రోడ్డు పనులు చేపట్టండి

కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రశాంత్

బండ్లగూడ,మార్చి 26: ఎక్సైజ్ అకాడమీ నుంచి కిస్మత్‌పూర్ వరకు చేపట్టిన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్ కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిస్మత్‌పూర్ నుంచి ఎక్సైజ్ అకాడమీ వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోవడంతోనే వాహన దారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

16మంది బైండోవర్

నేరస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

బంజారాహిల్స్,మార్చి 26: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారు, గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులతో పాటు ఎక్సైజ్ కేసుల్లో నిందితులుగా ఉన్న 16మందిని ఫిలింనగర్ పోలీసులు బైండోవర్ చేశారు. మంగళవారం వారికి కౌన్సెలింగ్ చేసిన ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ మేకల శ్రీనివాసులు ఎన్నికల సందర్భంగా ఎలాంటి నేరాలకు పాల్పడినా తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరందరినీ ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెత్తపై అవగాహన

చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటో వారికే అందజేయాలని యూసీడీ అధికారి రాధారాణి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు మంగళ వారం మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు చెత్త డంపింగ్ పాయింట్లను గుర్తించి అక్కడ ముగ్గులు వేసి ఇక్కడ చెత్తను వేయరాదని రాయాలని సూచించారు.చిరు వ్యాపారులు,తోపుడు బండ్ల యజమానులకు కూడా చెత్తపై అవగాహన కల్పించారు.

– బండ్లగూడ,మార్చి 26:

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

14వ వార్డులో తెలంగాణ మైనార్టీ రెసిడెన్సి జూనియర్ కళాశాల వద్ద డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్ తదితరులు

శంషాబాద్ రూరల్, మార్చి 26 : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్ సూచించారు. మంగళవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో చౌరస్తా వద్ద ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్సి జూనియర్ కళాశాల(బాలికల), శ్రీ విజ్ఞాన్ పీజీ కళాశాల భవనంతో పాటు చుట్టు పక్కల ఉన్న పలువురి ఇండ్ల నుంచి డ్రైనేజీ రోడ్డుపైకి వస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్ అత్యవసర పనుల కింద నిధులు తీసుకొచ్చి డ్రైనేజీ సమస్యను పరిష్కారం చేయించారు. అదేవిధంగా 14వ వార్డులో కూడా ప్రతి బస్తీలో సీసీ రోడ్లు వేయించామన్నారు. పెండింగ్ పనులను కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు.

ఓటు వేసేలా చైతన్యం తేవాలి

యూసుఫ్‌గూడలో 'ఐ ఓట్ ఫర్ ష్యూర్'.. 5 కే రన్‌లో పాల్గొన్న ఈఆర్ఓ, డీసీ సేవా ఇస్లావత్, యూసీడీ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ ఆఫీసర్ హిమబిందు తదితరులు

జూబ్లీహిల్స్,మార్చి 26: ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ నమోదు చేసేందుకు కృషి చేయాలని జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 5కే రన్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ ఆధ్వర్యంలో యూసీడీ, శానిటేషన్ విభాగాల సిబ్బంది ' ఐ ఓట్ ఫర్ ష్యూర్'.. 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు నుంచి సర్కిల్ వీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ రవి, ఈఎస్ సంతోష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రశాంత్, వెంకటయ్య, శ్రీనివాస రావు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కమిషనర్ శరత్‌చంద్రతో సమస్యలపై చర్చిస్తున్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ,మార్చి 26 :బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి పలువురు కార్పొరేటర్లతో కలిసి మంగళవారం కమిషనర్ శరత్ చంద్రకు విజ్ఞప్తి చేశారు.కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ దీపాలు,మంచినీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు.విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.వెంటనే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఇందుకు స్పందించిన కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ మున్సిపల్‌లకు విద్యుత్ దీపాలను సరఫరా చేసే కాంట్రాక్టర్ బదిలీ కావడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. త్వరలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తలారి చంద్రశేఖర్,ముద్దం రాము,భూపాల్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి,అస్లాంబిన్ అబ్దుల్లా, ప్రశాంత్, నాయకులు ప్రేమ్‌గౌడ్,సంగారెడ్డి, గోపాల్, రాజిరెడ్డి,టింకురెడ్డి పాల్గొన్నారు.

29 నుంచి ఘట్‌కేసర్‌లో జాతీయ సమావేశాలు

ఖైరతాబాద్, మార్చి 26 : భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 29 నుంచి ఘట్‌కేసర్‌లోని రాష్ట్రీయ విద్యా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ గండ్ల తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో దేశంలోని సంఘటిత, అసంఘటిత రంగంలో పనిస్తున్న ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, బీడీ, భవన నిర్మాణ కార్మికులు, డొమెస్టిక్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగానికి చెందిన 44 ఫెడరేషన్ల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి టి. రాంరెడ్డి,ఉపాధ్యక్షులు జి. రమేశ్ గౌడ్, రవీంద్ర హింటే తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

మణికొండ, మార్చి 26: బీజేపీ ఓబీసీ మోర్చా బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేయడంతో పాటు బీజేపీని బలమైన శక్తిగా తీర్చిదిద్దుతున్నామని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ అన్నారు. రెండో సారి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను మంగళవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మభిక్షం చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం

హిమాయత్‌నగర్ మఖ్దూం భవన్‌లో ధర్మభిక్షం పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హిమాయత్‌నగర్,మార్చి26: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం సమాజానికి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ అజీజ్‌పాషా,చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ధర్మభిక్షం 13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం హిమాయత్ నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మభిక్షం చిన్ననాటి నుంచే ఉద్యమ బాటపట్టి అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించారని గుర్తు చేశారు.నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ధర్మభిక్షం క్రియా శీలక పాత్ర పోషించారని, మనిషిని మనిషిగా గుర్తించి, గౌరవించడంలో ఆదర్శప్రాయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గీత పనివారాల సంఘం జాతీయ అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలుగౌడ్, నాగ భూషణం,కె.వి.ఎల్,ఆరుట్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమావేశానికి శంషాబాద్ నాయకులు

శంషాబాద్ నుంచి తరలివెళ్లిన అధ్యక్షుడు చంద్రారెడ్డి, పార్టీ నాయకులు

శంషాబాద్ రూరల్, మార్చి 26 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ గెలుపు కోసం రాజేంద్రనగర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి శంషాబాద్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కే చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ జయమ్మ, పార్టీ నాయకులు నీరటి రాజు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు దవణాకర్‌గౌడ్, సతీష్,శ్రావణ్‌గౌడ్‌లతో పాటు ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు ఎంపీటీసీలు తరలివెళ్లారు. దీంతో పాటు శంషాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్‌లతో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు తరలివెళ్లారు.

మధురానగర్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

వెంగళరావునగర్, మార్చి 26:మధురానగర్ పోలీసు స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలో బాగా పనిచేసి పోలీసు డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆయన మధురానగర్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడి వారికి తగిన సూచనలు చేశారు.

మధురానగర్ పోలీసు స్టేషన్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మణికొండ, మార్చి 26 : చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసి సీఎం రేవంత్‌రెడ్డికి బహుమానం అందజేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్ అన్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకుల సమావేశాన్ని మంగళవారం సీఎం నివాసంలో జరిగిన సమావేశంలో కస్తూరి నరేందర్ మాట్లాడారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, నాయకులు లక్ష్మీనారాయణ, తాజుద్దీన్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

చేతిరాత పోటీలో ప్రథమ బహుమతి

స్నేహిత్‌కు బహుమతి అందజేస్తున్న శరణి

హిమాయత్‌నగర్,మార్చి26: నారాయణ విద్యాసంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే దాండీ–స్టైలస్, అందమైన చేతిరాత పోటీ పరీక్షలో నారాయణగూడలోని నారాయణ స్కూల్‌లో మొదటి తరగతి చదువుతున్న విద్యార్థి స్నేహిత్ తన ప్రతిభ చాటాడు.ఐదు రౌండ్లలో తన ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయిలోనే ప్రథమంగా నిలిచి మొదటి బహుమతి అందుకున్నారు. మంగళవారం బహుమతితో పాటు గోల్డ్ మోడల్ ప్రశంసా పత్రం, జ్ఞాపికను నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు శరణి చేతుల మీదుగా అందుకున్నారు.ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ఈ-చాంప్స్ కో ఆర్డినేటర్స్ భవాని, మహేశ్వరి, ఏజీఎం బాల పరమేశ్వరి,ప్రిన్సిపాల్ హర్‌నీత్‌కౌర్,వైస్ ప్రిన్సిపాల్ మోహి ఉన్నిసా పాల్గొన్నారు.

లష్కర్ జిల్లా ఏర్పాటు కోసం..

సికింద్రాబాద్, మార్చి 26: లష్కర్ సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు కోసం శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. అశోక్ గురుస్వామి ఆధ్వర్యంలో జిల్లా సాధన సమితి నాయకులు అయ్యప్ప కృప కావాలని కోరారు.

బీఆర్ఎస్ వెంటే మేమంతా

తెలంగాణ భవన్‌కు వచ్చిన ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య నాయకులు

బంజారాహిల్స్, మార్చి 26: తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశానికి ఖైరతాబాద్ నియోజకవర్గంనుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో పాటు పలు డివిజన్లకు చెందిన ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి టి.పద్మారావు గెలుపు కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు. మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ శ్రేణుల్లో నింపింది. బీఆర్ఎస్ టికెట్ మీద ఎమ్మెల్యేగా గెలిచి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్‌కు ప్రధాన అనుచరులుగా ఉన్న పలువురు నేతలు సైతం బీఆర్ఎస్‌లోనే ఉంటామని ప్రకటించడం విశేషం.

పద్మశాలీలకు లోక్‌సభ స్థానాలను కేటాయించాలి

నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

హిమాయత్‌నగర్,మార్చి 26: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పద్మశాలీలు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని,అన్ని రాజకీయ పార్టీలు రెండు లోక్‌సభ స్థానాలను కేటాయించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి,రాష్ట్ర అధ్యక్షుడు మురళి,మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ కోరారు.మంగళవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టెస్కోతో అమలయ్యే నేతన్న బీమా చేనేతమిత్ర,హెల్త్ కార్డు వంటి పథకాలకు నిధులు కేటాయించి వాటిని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం చేనేత రాష్ట్ర,జాతీయ అవార్డులు అందుకున్న గ్రహీతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం విశ్వనాథం, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల,ఇంజినీరింగ్ విభాగం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, నాయకులు మాచర్ల రాంచందర్,మెతుకు సత్యం, రమేష్, అవ్వారి భాస్కర్, గుంటక రూప,అమరేందర్,కత్తుల సుదర్శన్, అంబటి శ్రీనివాస్, గౌతం, రాకేష్,శ్రీనివాస్,జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో మాదిగలకు అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న భాగవాన్ ప్రసాద్

ఖైరతాబాద్, మార్చి 26 : కాంగ్రెస్ పాలనలో మాదిగలకు న్యాయం జరుగడం లేదని నేషనల్ ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యక్షుడు చింతా భగవాన్ ప్రసాద్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 లక్షల మంది దళిత జనాభా ఉంటే అందులో 62 లక్షల మంది మదిగలే ఉన్నారన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు సైతం మాలలకు ప్రాధాన్యతనిస్తూ మాదిగలను విస్మరించారని ఆరోపించారు. త్వరలోనే జరిగే రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. రెండు ఎమ్మెల్సీ పదవులతో పాటు, కార్పొరేషన్లలో కనీసం నాలుగు మాదిగలకే కేటాయించాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులలో మాదిగలకు మూడింట రెండు వంతుల నిధులు ఇవ్వాలని, దళిత అభివృద్ధి పథకాల్లోనూ జనాభా దామాషా ప్రకారం వాటా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఓయూ జేఏసీ అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఆకుల శ్రీనివాస్, జయరాం పాల్గొన్నారు.

ముందు ఎస్కార్ట్ వాహనం

- వెనుక గంజాయి లోడ్‌తో ట్రాలీ
- పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 30 కిలోల గంజాయి

బండ్లగూడ,మార్చి 26: ఎస్కార్ట్‌ను పెట్టుకుని గంజాయిని తరలిస్తున్న మురా సభ్యులను రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 30 కిలోల గంజాయి, ట్రాలీ, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి కథనం ప్రకారం.. చార్మినార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అయాన్ అలీ, మమ్మద్ మోహినుద్దీన్ భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తన బృందంతో కలిసి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారు జామున వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసులకు చిక్కకుండా ముందుగా ఒకరు ఎస్కార్ట్‌గా బైక్‌పై వస్తుండగా.. అతడిని అనుసరించి మరొకరు ట్రాలీలో గంజాయితో వస్తున్నారు. పోలీసులు బైక్‌పై వస్తున్న వ్యక్తిని పట్టుకుని విచారించడంతో.. వెనుకాల వస్తున్న గంజాయి ట్రాలీ గురించి తెలిపాడు. వెంటనే ఆటో ట్రాలీని నిలిపి తనిఖీ చేయగా.. 30 కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ.10. 50 లక్షల వరకు ఉంటుందన్నారు. నిందితుల నుంచి గంజాయి, ఆటో ట్రాలీ, బైక్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

సీజ్ చేసిన గంజాయిని భద్రాచలంలో ఒడిశాకు చెందిన దీపక్ పాటిల్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. తదుపరి విచారణ నిందితులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

ఇంట్లో దొంగలు పడ్డారు

- బంగారు, వెండి నగలు చోరీ
- సెంట్రల్ లాకింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి: డీఐ

బండ్లగూడ, మార్చి 26: ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. కిస్మత్‌పూర్ శివ సాయి నగర్ కాలనీలో నివాసి లోకేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. హోలీ పండుగ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి సోదరుడి ఇంటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చి చూడగా.. ఇంట్లో దొంగలు పడి 19.4తులాల బంగారం, కిలో వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. వెంటనే లోకేశ్ పోలీసులకు సమాచారమిచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితుల నుంచి వివరాలను సేకరించారు.

ఇంటి యజమాని లోకేశ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా కేసును దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం డీఐ నాగరాజు మాట్లాడుతూ.. తాళం వేసి ఉన్న ఇండ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఇంటికి సెంట్రల్ లాకింగ్‌ను సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటి చుట్టూ సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

IN THE COURT OF THE HONBLE ADDL JUNIOR CIVIL JUDGE AT VIKARABAD
I.A No. 394 OF 2022
IN
O.S No. 30 of 2020
Between:
Smt Vimala ...Petitioner/Plaintiff
AND
Smt. Padmamma & Others ...Respondents/Defendants
To,
2. C. Sirisha W/o G. Eswaraih
Aged about 59 Years, Occ: House wife
R/o H.No 13-6-446/32, Kojjeti Enclave,
Gudimalkapur, Hyderabad-500028
3. M/s. Crystal Dwellings Pvt Ltd.
Rep by its Managing Director
Mr. Surath Singh Malhotra,
S/o. Jagadish Singh Malhotra,
Aged about 65 years, Occ: Business
R/o H.No 8-2-608/M/3, Road No. 10,
Banjara Hills, Hyderabad-500034,
NOTICE
Take notice that the petitioner/plaintiff has filed the above petition under order 26 Rule 13 R/W SEC 151 C.P.C. for appoint commissioner - Advocate In the above case for partition of the suit property i.e. Sy.No 320/AA/2 adm Ac.3-22 Gts., Situated at Tekulapalli Village, Mominpet Mandal, Vikarabad District., as per the preliminary Decree and to allot the physical possession of the suit property with meats and bounds against the respondents/defendants and the same is coming for your appearance and the same is posted to 03-05-2024 for your appearance, as such you are may appear either in person or through your advocate on 03-05-2024 at 10.30 AM at the above mention court, failing which the matter will be decided on merits.
"BY ORDER"
Sd/- S. JANGAIAH, Advocate
O/o. Chamber, 4-3-108, Ananthagiri Road, Vikarabad, Telangana State-501101
Cell No. 98494 73421